
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
3★★★ జిల్లా వార్తలు
సోమవారం 12 ఆగస్టు 2024

రెచ్చగొట్టి దోచుకోవడమే బీఆర్ఎస్ లక్ష్యం 5లో..

వేములవాడకు పోటెత్తిన భక్తులు - బ్రేక్ దర్శనం టికెట్స్ కోసం డిమాండ్ 5లో..



రాయితీ యంత్రాలు అందేనా?

- ఏడేళ్లుగా అమలుకు నోచుకోని యంత్రలక్ష్మి పథకం
- సబ్సిడీ యంత్రాల కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు
- ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 2.42 లక్షల ఎకరాల్లో సాగు
- యాసంగిలో 1.75 లక్షల ఎకరాలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక యంత్రాలను ఉపయోగించి కొత్త పుంతలు తొక్కాలని అన్నదాతలకు ప్రభుత్వం సూచనలు చేయడం మినహా ఆర్థికంగా నిలబెట్టాల్సిన పథకాలను మాత్రం దూరం చేస్తోంది. ఆధునిక పద్ధతులను ప్రోత్సహించడానికి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆధునిక యంత్రాలను రాయితీపై అందించే వారు. అ తరువాత వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం రెండేళ్ల పాటు యంత్రలక్ష్మి పథకంలో ట్రాక్టర్లు, పనిముట్లు అందించినా తరువాత నిలిపివేసింది. దాదాపు ఏడేళ్లుగా వ్యవసాయ యాంత్రీకరణకు రాయితీ దూరమయ్యింది. గత ప్రభుత్వం ఎకరానికి రెండు పంటలు కలిపి రూ. 12 వేల ఆర్థిక సాయం అందించడంతో యంత్రలక్ష్మి కనుమరుగై పోయింది.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మిడ్ మానేరు, అన్నపూర్ణ ప్రాజెక్టులలోకి కాళేశ్వరం జలాల ఎత్తిపోతలతో భూగర్భ జలాలు పెరగడం, 24 గంటలు వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌తో సాగు విస్తీర్ణాన్ని పెంచుకున్నారు. కూలీల కొరతతో ఇబ్బంది పడుతున్న రైతులు వ్యవసాయ పనిముట్లు ఉపయోగకరంగా ఉంటాయని భావించినా ప్రస్తుతం యంత్రలక్ష్మీ పథకానికి మంగళం పాడారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించే రైతులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 2010లో యాంత్రీకరణ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం మార్పులు చేసి ట్రాక్టర్‌లకే పరిమితం చేసింది. వరినాట్ల యంత్రాలు, రోటేవేటర్లు, నాగళ్లు, కల్టీవేటర్లు, థైవాస్ స్ప్రేయర్లు వంటి యంత్రాలు యంత్రలక్ష్మీ పథకం కింద అందించే వారు. దీంట్లో రైతులకు 50 నుంచి 90 శాతం రాయితీ లభించేది. రైతులు ఎంతో ఉపయోగపడే ఈ పథకం తిరిగి ప్రారంభించాలని రైతులు కోరుతున్నా పట్టించుకునే వారే లేరు.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం...

జిల్లాలో సాగనీటి వనరులు పెరగడం, భూగర్భ జలాలు రైతులకు అందుబాటులో రావడంతో సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో 2.42 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో వరి 1.63 లక్షల ఎకరాలు, పత్తి 49,215 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. యాసంగిలోనూ 1.75 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు రైతులు వేస్తున్నారు. యాసంగిలో వరి ప్రధానంగా 1.74 లక్షల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. రైతులు ఆధునిక సాగును కాంగ్రెస్ ప్రభుత్వమైనా ప్రోత్సహించాలని కోరుకుంటున్నారు.

అక్రమాల వెల్లువ..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ యాంత్రీకరణలో కేవలం ట్రాక్టర్‌లకే పరిమితం చేశారు. 2017-2018 వరకు కొనసాగించిన ఈ పథకంలో ఇచ్చిన సబ్సిడీ ట్రాక్టర్లు గులాబీ నేతలకే పరిమితమయ్యాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఎమ్మెల్యేల సిఫార్సులు, రాజకీయ నాయకుల జోక్యంతో 2017లో వంద ట్రాక్టర్లు, 2018లో 86 ట్రాక్టర్లతో పాటు హార్వేస్టర్లు, రోటేవేటర్లు రైతులకు మంజూరు చేశారు. ఆసమయం లోనే సబ్సిడీ ట్రాక్టర్‌లపై పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. స్థానిక సంస్థల సమావేశాల్లోనూ విమర్శలు రావడంతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది. నిధుల కొరత కూడా ఉండడంతో పథకాన్ని ముందుకు తీసుకుపోలేదు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం మూలంగా సన్నకారు చిన్నకారు రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని కూలీల కొరతను కూడా అధిగమించే అవకాశం ఉందని సబ్సిడీ యంత్రాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందజేయాలి

- ఎడమల బాల్‌రెడ్డి, రైతు, తంగళ్లపల్లి



గతంలో ట్రాక్టర్ గొర్రు 40 శాతం సబ్సిడీపై తీసుకున్నాను. సుమారు ఐదు సంవత్సరాలుగా వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై అందివ్వడం లేదు. మూడేళ్ల క్రితం సబ్సిడీపై నాగలి తీసుకుందామని వ్యవసాయ శాఖా కార్యాలయానికి వెళ్తే సబ్సిడీ పథకం ఎత్తివేశారని చెప్పారు. సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందివ్వాలని చాలామంది రైతులు ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందజేయాలి.

యాంత్రీకరణ పథకాన్ని పునఃప్రారంభించాలి

- మర్రి రాజు, రైతు, చందుర్తి



వ్యవసాయ కూలీల కొరత తీవ్రమవుతుండగా సాగుకు సాయంగా నిలిచే ఆధునిక యంత్రాలను రాయితీపై ఇవ్వకపోవడంతో రైతులకు సాగు కష్టంగా ఉంది. ప్రభుత్వం యంత్ర పరికరాలపై ఇచ్చే రాయితీలకు మంగళం పాడింది. ఫలితంగా రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడే పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం యంత్రాల్లేనిదే ఏ పొలం పనిసాగని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం యాంత్రీకరణ పథకాన్ని ప్రారంభించి రాయితీ ఇవ్వాలి.

వ్యవసాయ యంత్రాలపై రాయితీ అందించాలి

- గుడి కుమార్ రెడ్డి, రైతు, వట్టెంల



గ్రామీణ ప్రాంతాల్లో పేద రైతులకు వ్యవసాయ యంత్రాలపై ప్రభుత్వం రాయితీలను అందించాలి. ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేయాలంటే యంత్రాల అవసరం ఎంతో ఉంటుంది. ఇనుప నాగలి మొదలు, ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు, రోటోవేటర్లు తదితర యంత్రాలపై గతంలో రాయితీలు అందించారు. అదే రీతిలో వ్యవసాయ యంత్రాలపై ప్రభుత్వం రాయితీలు అందించాలి.

రైతులకు సబ్సిడీపై పనిముట్లు అందించాలి

- మల్యాల రాజవీర్, రైతు, గంభీరావుపేట



రైతులకు వ్యవసాయానికి అవసరమయ్యే పనిముట్లు ప్రభుత్వం అందించాలి. గతంలో యంత్రలక్ష్మి పథకం కింద రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు ఇచ్చారు. రైతులకు ప్రధానంగా కేజీవీల్స్, నాగళ్ళు, రోటవేటర్, హార్వెస్టర్లు, స్ప్రే పంపులు, గొర్రు, మిని ట్రాక్టర్లు వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వం అందించాలి. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రైతు ప్రభుత్వంగా చెప్పకుంటున్నారు. సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందిస్తే రైతులకు మరింత మేలు చేసినట్టు అవుతుంది.

ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే



అర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే

బోయినపల్లి, ఆగస్టు 11: మృతుని కుటుంబ సభ్యులకు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేతుల మీదుగా రూ పది వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. కోదురుపాక గ్రామానికి చెందిన ఉప్పులేటి హనుమయ్య అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులకు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగుల వంశీ ఆధ్వర్యంలో 10 వేల రూపాయలను పోగుచేసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు కూస రవీందర్, మాజీ ఎంపీపీ పర్లపెల్లి వేణుగోపాల్, నాయకులు బండి శ్రీనివాస్, శాలివాన శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ వలస కార్మికుడి కోసం కేటీఆర్ లేఖ

సిరిసిల్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశంలోని బహ్రెయిన్ జైల్లో ఉన్నా రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచకు చెందిన మానువాడ నర్సయ్యను భారత్‌కు రప్పించేందుకు బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కే తారకరామారావు ఆదివారం విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు లేఖ రాశారు. బహ్రెయిన్‌లోని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం నర్సయ్య విడుదలకు సహకరించాలని సూచనలు చేశారు. చీర్లవంచకు చెందిన నర్సయ్య 28 ఏళ్ల క్రితం గల్ఫ్ దేశానికి వలసవెళ్లాడు. గత జనవరి నుంచి జైల్లో మగ్గుతున్నాడు. 1996లో బహ్రెయిన్‌కు వెళ్లిన నర్సయ్య, ది అరబ్ ఇంజనీరింగ్ కాంట్రాక్టింగ్ కంపెనీలో మూడేళ్లు పనిచేశాడని 1999 ఆగస్టులో వర్క్ పర్మిట్ ముగిసినా అక్కడే పనిచేస్తున్నారు. 2001లో పాస్‌పోర్టు గడువు ముగిసిపోవడంతో ఇండియన్ ఎంబసీ రెన్యూవల్ చేసింది. మళ్లీ పాస్‌పోర్టు గడువు ముగిసిపోవడం, నర్సయ్య వర్క్ పర్మిట్, పాస్‌పోర్టు లేకపోవడంతో అక్రమంగా దేశంలో ఉంటున్నాడని అరెస్ట్ చేశారు. ఈ విషయమై కేటీఆర్ నర్సయ్యను భారత్‌కు రప్పించేందుకు విదేశాంగ మంత్రితో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖను రాశాడు. నర్సయ్య విడుదలకు సహకరించాలని అక్కడి ఎన్ఆర్ఐ విభాగాన్ని కూడా కోరారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడి వీలైనంత తొందరలో నివేదిక ఇచ్చేలా ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు.

సిరిసిల్ల మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం

- మున్సిపల్ ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలి

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



గణేష్‌నగర్‌లో జెండా పండుగలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 11: రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అన్ని వార్డుల నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి కౌన్సిలర్లను గెలిపించి సిరిసిల్ల మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండాను ఎగిరేసేందుకు కాంగ్రెస్ శ్రేణులంతా సిద్ధం కావాలని సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి కోరారు. సిరిసిల్ల పట్టణంలోని 4, 5వ వార్డు సుభాష్‌నగర్, 19వ వార్డు నెహ్రూనగర్ 20వ వార్డు సాయినగర్, 21వ వార్డు గణేష్‌నగర్‌లో వార్డు కౌన్సిలర్లు నాయకులతో కలిసి కాంగ్రెస్ జెండాలను ఆదివారం కేకే మహేందర్‌రెడ్డి ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 39 వార్డులో కాంగ్రెస్ జెండా పండుగను నిర్వహిస్తామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆయా వార్డుల నుంచి పోటీ చేసేందుకు ముందుకు వచ్చేవారు ఇప్పటి నుంచే ప్రచారాన్ని చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చొప్పందండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యానప్రసాద్, కౌన్సిలర్ రవి, సీనియర్ నాయకులు సంగీతం శ్రీనివాస్, యెల్లె లక్ష్మీనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, మడుపు శ్రీదేవి, గడ్డం నర్సయ్య, అకునూరి బాలరాజు, వెంగళ లక్ష్మీనర్సయ్య, వైద్య శివప్రసాద్, భీమవరం శ్రీనివాస్, సలేంద్రీ వేణుగోపాల్ యాదవ్, తదతరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట పద్మశాలి సంఘం కార్యవర్గం

గంభీరావుపేట, ఆగస్టు 11: గంభీరావుపేట పద్మశాలి సంఘం కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. స్థానిక రేణుక ఎల్లమ్మ ఆలయంలో పద్మశాలి సంఘం సభ్యులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యెల్ల దేవేందర్, ఉపాధ్యక్షుడు దెవసాని కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా శ్రీగాద గణేష్, కోశాధికారిగా యెల్ల దేవేందర్, సంయుక్త కార్యదర్శిగా వాసం శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా దాసరి బాలకిషన్, వాసం రాజారాం, యెల్ల గంగారాం, ఇప్పకాయల దేవయ్య, మేరుగు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సంఘం పెద్దలు యెల్ల బాబురావు, వాసం శివాజీ, రమేష్ పాల్గొన్నారు.

సామాజిక చైతన్యం రగిలించిన వీర వనిత చాకలి అయిలమ్మ

- రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజ్ శంకర్

గంభీరావుపేట, ఆగస్టు 11: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి వెనుకబడిన వారిలో సామాజిక చైతన్యం రగిలించిన వీర వనిత చాకలి ఐలమ్మ అని రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు బసవ రాజ్ శంకర్ పేర్కొన్నారు. గంభీరావుపేట మండలం లింగన్నపేటలో స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో చిట్యాల చాకలి అయిలమ్మ విగ్రహాన్ని ఐలమ్మ మనవడు చిట్యాల రామచంద్రం, ముని మనవరాలు శ్వేత, ముని మనవడు సంపత్ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం రజక సంఘం అధ్యక్షుడు సుద్దాల భూమయ్య అధ్యక్షతన నిర్వహించిన సభలో పలువురు మాట్లాడారు. చాకలి అయిలమ్మ పోరాట పటిమను యావత్తు తెలంగాణ ప్రజలు మరువలేరని రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు బసవరాజ్ శంకర్ అన్నారు. ఐలమ్మ పోరాట ఫలితంగానే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఉద్భవించి నిజాం నిరంకుశ పాలను దహించివేసిందన్నారు. నాలుగు వేల మంది అమరుల త్యాగాలతో తెలంగాణ చరిత్ర తిరగరాసిందన్నారు. 10 లక్షల ఎకరాల భూ పంపిణీ అయిలమ్మ పోరాట ఫలితమే అన్నారు. అయిలమ్మ ఆశయ సాధనకు అందరం కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, రజక సంఘం అధ్యక్షుడు సుద్దాల భూమయ్య, రజక సంఘం ఓయూ జేఏసీ చైర్‌పర్సన్ గంపల శ్రీనివాస్, మండల రజక సంఘం అధ్యక్షుడు దేవయ్య, మాజీ ఎంపీటీసీ దయాకర్‌రావు, మాజీ ఉప సర్పంచ్ దుబాసి రాజు, ఆలయ కమిటీ చైర్మెన్ పాపారావు, వైస్‌చైర్మన్ జోగు సురేష్, నాయకులు చింతల కిష్టయ్య, రజక సంఘం నాయకుడు శ్రీధర్ ఉన్నారు.

ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి





గజమాలతో ప్రభుత్వ విప్‌ను సన్మానిస్తున్న పిల్లి కనుకయ్య, తదితరులు, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న అది శ్రీనివాస్

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఆగస్టు 11: ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి సబ్‌స్టేషన్ మంజూరు చేసినందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు రుద్రవరం, ఆరెపల్లి, సంకెపల్లి గ్రామాలకు చెందిన నిర్వసితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలివచ్చి గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కాగా ముంపు గ్రామాల సమస్యలు త్వరలోనే ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందన్నారు. అర్హులైన నిర్వాసితుల సమస్యలు త్వరలోనే పరిష్కారం చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య మాట్లాడుతూ మధ్యమానేరు జలాశయంలో ముంపు గురైన గ్రామాల నిర్వసితులు కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. తమ పాత గ్రామంలోని సబ్‌స్టేషన్ మిడ్‌మానేరు బ్యాక్ వాటర్‌లో మునిగిపోయిందన్నారు. ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ప్రత్యేక చొరవ తీసుకుని సబ్‌స్టేషన్ మంజూరు చేసి తమ సమస్యను పరిష్కారించారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పోరెడ్డి రవీందర్, గాలిపెల్లి స్వామి, ఊరడి రాంరెడ్డి, కత్తి కనుకయ్య, రగుడు పర్శరాములు, ఇటిక్యాల రాజు, ఎర్రం ఆగయ్య, బోనాల రమేష్, సిలివేని మల్లేశం తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన మై విలేజ్‌షో సభ్యులు..

వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మై విలేజ్ షో టీం సభ్యులు ఆదివారం కలిశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన మై విలేజ్ షో టీం సభ్యులు ఆది శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో గంగవ్వ, బుర్ర శివకృష్ణ, గీల అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

చందుర్తి: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం ఎన్గల్, మల్యాల గ్రామాల్లో మెరుపుల లచ్చయ్యకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన 13 వేల రూపాయలు, సర్వాయి లింగవ్వకు 51 వేల రూపాయలు, నేరళ్ల అక్షయకు 26 వేల రూపాయల విలువైన చెక్కులను ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, మాజీ జడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, నాయకులు ఎనగంటి శంకర్, మ్యాకల గణేష్, లింగంపల్లి సత్తయ్య, ముస్కు ముకుందరెడ్డి, గసికంటి ప్రభాకర్, సంటి ప్రసాద్, మల్యాల రాజయ్య, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి కోసం పాటుపడితే ప్రజల గుండెల్లో ఉంటారు

- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట, ఆగస్టు 11: గ్రామాభివృద్ధికి పాటుపడిన వారు ప్రజల గుండెల్లో ఉంటారని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని గాలిపెల్లి మాజీ సర్పంచు స్వర్గీయ అయ్యన్నగారి లింగారెడ్డి విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతు లింగారెడ్డి గ్రామాభివృద్ధి కోసం నిరంతరం కృషిచేసి ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. బైపాస్‌రోడ్డు కోసం ఎకరం భూమి, బీసీ హస్టల్ కోసం 15 గుంటల భూమిని విరాళంగా అందించాడని పేర్కొన్నారు. పలు సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాముడైన లింగారెడ్డి ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ అన్నాడి అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ అయిలయ్య, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, కుమారులు అయ్యన్నగారి హరికృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, నాయకులు మాధవరెడ్డి, చంద్రారెడ్డి, బాలనాగాచారి, ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాలపోచయ్య, ఆనందరెడ్డి, రమేష్, మల్లుగారి దేవేందర్ రెడ్డి, మాధవరెడ్డి, రజనీకాంత్‌లతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

పలు గ్రామాల్లో అధ్వానంగా రహదారులు



కోతకు గురై ప్రమాదకరంగా మారిన నాగారం మర్తన్ పేట ప్రధాన రహదారి

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కోనరావుపేట ఆగస్టు 11: కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో పలు గ్రామాల ప్రజలు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులుగా కురిసిన వర్షాలకు పలు గ్రామాల ప్రధాన రోడ్లు అధ్వానంగా మారాయి. మర్తన్‌పేట నాగారం గ్రామాల మధ్య ప్రధాన రోడ్డు వరద తాకిడికి కోతకు గురై గుంతగా మారింది. ఆ గుంత రోడ్డు పక్కనే ప్రమాదకరంగా మారింది. అంతే కాకుండా రామన్నపేట సుద్దాల ప్రధాన రహదారి బురదమయంగా మారడమే కాకుండా ఈ గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు కూలి ప్రమాదకరంగా మారింది. గ్రామాల్లో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారినా ప్రత్యేక అధికారుల పాలనలో మరమ్మతులు చేపట్టడంలో జాప్యం జరుగుతోంది. దీంతో పలు గ్రామాల ప్రజలు ప్రజా ప్రతినిధులు లేకపోవడంతో ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ కార్యదర్శులు నిధులులేక ఏ పని చేయలేకపోతున్నారు. రహదారులను మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జగిత్యాలరూరల్, ఆగస్టు 11: జగిత్యాల పట్టణంలోని విద్యానగర్‌లో ఓ ఇంటిలో ఆదివారం పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి రూ.6900 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్‌లో ఇంటి యజమాని పేకాటరాయుళ్లకు ఇల్లు అద్దెకు ఇచ్చి పేకాట ఆడిస్తున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న నలుగురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి స్వల్పగాయాలు

శంకరపట్నం, ఆగస్టు 11: శంకరపట్నం మండలం తాడికల్ శివారులో కర్ర లోడుతో వెళ్తున్న లారీ, బస్సు ఎదురెదురుగా ఢీకొనడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తుంది. వరంగల్ వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కర్ర లోడుతో ఉన్న లారీ కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై తాడికల్ శివారులోని పెద్దమ్మ గుడి సమీపంలో ఢీకొనడంతో లారీలో ఉన్న కర్రలు బస్సు అద్దాలకు తగలడంతో పగిలి పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భాస్కర్ నాయక్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 11: గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన బాదవత్ భాస్కర్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఏబీఎస్ఎస్ కార్యాలయంలో గిరిజన విద్యా సంఘం జాతీయ, రాష్ట్ర కార్యవర్గ ఏర్పాటు సమావేశంలో ఆయ నను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.ఎన్నిక పట్ల గిరిజన విద్యార్థి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మల్యాల, ఆగస్టు 11: మండలంలోని మద్దుట్లలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. ఈ సంఘటనలో 15తులాల బంగారు నగలను దొంగలు ఎత్తుకెళ్లారు. మల్యాల ఎస్సై నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సామల దేవయ్య అనే వ్యక్తి నెల రోజుల క్రితం మల్యాలలోని కూతురు ఇంటికి వచ్చి ఉంటున్నారు. గురువారం దేవయ్య మద్దుట్లకు వెళ్లి రాగా ఆదివారం కూడా మరోసారి వెళ్లాడు. ఇంటి తాళం తీసి ఉండడంతో అనుమానం వచ్చిన ఆయన ఇంట్లోకి వెళ్లి పరిశీలించాడు. బంగారం కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ నీలం రవి, ఎస్సై నరేష్ సంఘటన స్థలం పరిశీలించారు. జాగిలాలు, క్లూస్ బృందాలతో గాలింపు చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ, ఎస్సై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణంలో ప్రమాదం

● కాగజ్‌నగర్‌కు చెందిన సెంట్రింగ్ కార్మికుడి మృతి

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 11: గోదావరిఖని ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఎమర్జెన్సీ యూనిట్ భవన నిర్మాణంలో శనివారం రాత్రి ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చెందిన సెంట్రింగ్ కార్మికుడు వాగడి గణేష్ (26) మృతి చెందాడు. శనివారం రాత్రి సెంట్రింగ్ పనిచేసి భోజనం తరువాత సెంట్రింగ్ జరిగిన చోటే తోటి కార్మికులతో కలిసి పడుకున్నాడు. పైన దోమలు ఉన్నాయంటూ మిగతా కార్మికులు కిందకు దిగారు. కానీ గణేష్ అక్కడే పడుకున్నాడు. ఆదివారం జామున వర్షం పడుతుండంతో కిందకు దిగే క్రమంలో జారి లిఫ్ట్ కోసం తవ్విన గొయ్యిలో పడిపోయాడు. అందులో నీరు ఉండడంతో ఊపిరి ఆడక మృతి చెందాడు. కాగా మృతుని కుటుంబానికి కాంట్రాక్టర్ రూ.6.5లక్షల నష్టపరిహారం చెల్లించినట్టు సమాచారం. గణేష్ సోదరుడు చందు ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల్లో శ్రావణ సందడి

● వేములవాడలో కోడె మొక్కుకు మూడు గంటల సమయం


వేములవాడలో పోటెత్తిన భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 11: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణం మాసం ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రాజన్న ఆలయానికి భక్తులు తరలివచ్చారు. ఆలయ కల్యాణ మండపంలో తలనీలాలు సమర్పించిన భక్తులు, ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. ఉదయం 10.15 గంటలకు బ్రేక్ దర్శనం అమలు కావడంతో టికెట్స్‌కు కోసం భక్తులు బారులు తీరారు. గంటల సమయంలో సుమారుగా 450 టికెట్స్ ఇచ్చారు. కోడెమొక్కు క్యూలైన్‌లో భక్తులు సుమారుగా మూడు గంటల పాటు నిరీక్షించారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి ప్రవేశించి రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. రాజన్న ఆలయానికి ఆదివారం 30 వేల మంది భక్తులు వచ్చినట్టు అధికారులు అంచనా వేశారు. భక్తుల తాకిడి పెరగడంతో ఈవో వినోద్‌రెడ్డి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. అన్నదాన సత్రంలో భక్తులను కలిసి భోజనం నాణ్యతపైన ఆరా తీశారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు, అల్లి శంకర్, ఎడ్ల శివసాయిలు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

కొండగట్టులో ముగిసిన శ్రావణ సప్తాహ ఉత్సవాలు

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో వారం రోజులుగా నిర్వహిస్తున్న శ్రావణ సప్తాహ ఉత్సవాలు ఆదివారంతో ముగి శాయి. చివరిరోజు ఆంజనేయస్వామికి 108 అష్టోత్తర శతకళశాభిషేకం, సహస్రనామ అర్చనను అర్చకులు ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి, అమ్మవారికి అభిషేకార్చన, సహస్రనామ కుంకుమార్చనతో పాటు ఒడిబియ్యం సమర్పించారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో ఆదివారం భక్తజన సందడి నెలకొంది. శ్రావణ మాసం పురస్కరించుకుని స్థానిక లక్ష్మీ నరసింహస్వామి అను బంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తులు ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించారు. అంతకు ముందు స్థానిక లక్ష్మీ నరసింహస్వామి అను బంధ ఆలయాల్లో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రత్యే క పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, ఆలయ వేదపండితులు రమేష్‌శర్మ, సా మవేద పండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.


కొండగట్టులో అష్టోత్తర శతకళశాభిషేకం చేస్తున్న అర్చకులు


ధర్మపురి గోదావరి వద్ద భక్తులు


ధర్మపురి ఆలయంలో..

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

● తెలంగాణ రెసిడెన్షియల్ విద్యాలయాల కార్యదర్శి రమణకుమార్

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 11 : మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర రెసిడెన్షియల్ విద్యాలయల కార్యదర్శి రమణకుమార్ ఆదేశిం చారు. ఆదివారం గురుకుల పాఠశాలను డీఈ యూసీఫ్‌తో కలిసి ఆయన సంద ర్శించారు. పాఠశాలలో మృతి చెందిన విద్యార్థుల వివరాలు, ఘటనకు సంబంధిం చిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. 15 రోజుల వ్యవధిలో గురుకుల పాఠశాలల్లో ఇద్దరు విద్యార్థులు అనుమానస్పదంగా మృతి చెందడం, మరో నలుగురు అస్వస్థతకు గురికావడం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కలిగించిందన్నారు. పాఠశాలలో చేస్తున్న పనులను పరిశీలించి, ఇంకా అవసరమైన వాటి గురించి నివేదిక ఇవ్వాలని నిర్వహకులకు సూచించారు. పనులు చేస్తున్న అధికారులు, నిర్వాహకులకు సూచనలు చేశారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం గురుకులంలో అధికారులు, నిర్వాహకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని వసతులు ఏర్పాటు చేయాలని, గదులు, స్నానపు గదులు, కిటికీలు ఏర్పాటు, దోమలు, విషపు కీటకాలు కుట్టకుండా ఏర్పాటు చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న రేకుల షెడ్లు, పాడు భవనాలను కూల్చివేయాలని, పారిశుద్ధ్యం పనులను చేపట్టాలన్నారు. నూతన భవనంలో కరెంట్, ప్లబింగ్ ఏర్పాటు, గదులలో అస్తవ్యస్తంగా ఉన్న కిటికీలకు మరమ్మతులు చేయించాలన్నారు. పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థులు మొండి మోక్షిత్, హేమంత్‌ల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇరువురి విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని, వారు కోలుకుంటున్నట్లు నిజామాబాద్ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల ఇన్‌చార్జి డీసీవో శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విద్య సాగర్, షైపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్య దర్శులు, ఆసీఫ్, అశోక్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.


పెద్దాపూర్ గురుకులంను పరిశీలిస్తున్న టీజీఆర్ఎస్ కార్యదర్శి రమణకుమార్

రేషన్ బియ్యం పట్టివేత

ఇల్లందకుంట, ఆగస్టు 11: ఇల్లందకుంట మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన లోకిని రాజేష్ అనే వ్యక్తి పేద ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఇల్లందకుంట ప్రధాన కూడలి వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 25క్వింటాళ్ల బియ్యం పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

చెంజర్లలో 10 క్వింటాళ్ల బియ్యం..

మానకొండూర్ : మండలంలోని చెంజర్ల గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన దరావత్ నర్సింహ శంకర పట్నం మండలంలోని తాడికల్ గ్రామంలో నివసిస్తున్నాడు. ప్రతి రోజు తన ఆటోలో గ్రామాలలో రేషన్ బియ్యాన్ని సేకరిస్తుంటాడు.

అందులో భాగంగా ఆదివారం 10క్వింటాళ్ల బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించాలి

● టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, అగస్టు 11: రాష్ట్రంలో జరుగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలోపు ఎస్‌జీటీలకు ఓటు హక్కు రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి కోరారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య ఉన్నత పాఠశాలలో ఆదివారం టీపీటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్‌జీటీలపైన వివక్ష చూపడం సరైందికాదని వారి సమస్యలు అందరూ పట్టించుకోవాలంటే ముందుగా వారికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును కల్పించాలన్నారు. అలాగే 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేస్తూ వారిని స్థానిక ప్రాంతాలకు బదిలీ చేయాలన్నారు. అలాగే సీపీఎస్ రద్దుకు సహకరిస్తూ ప్రక్రియను వేగవంతం చేయాలని అన్ని ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేసి డీఈడీతోపాటు బీఈడీ అర్హత కలిగిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు. ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను వెంటనే విడుదల చేయాలని అలాగే పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. పీఆర్సీ కమిటీ రిపోర్టును వెంటనే తెప్పించి అమలు చేయాలన్నారు. మోడల్‌స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు పూర్తిచేసి 010 ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. కేజీబీవీ, యూఆర్ఎస్ ఉపాధ్యాయులు ఎస్ఎస్ఏ సిబ్బందికి కనీస మూల వేతనం చెల్లించాలని, కేజీబీవీ మహిళా ఉపాధ్యాయులకు 27 సెలవులు మంజూరు చేయాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని 010 ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుమాల రామ్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ పూరెల్లి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లారపు పురుషోత్తం, సత్తు రవీందర్, విక్కుర్తి అంజయ్య, జిల్లా కార్యదర్శులు శ్రీధర్, డబ్బెడ హన్మాండ్లు, నాయకులు షైలారం తిరుపతి, బొజ్జ కృష్ణ, దేవేందర్, ఉపేందర్, మధుసూదన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

టీజీఎన్పీడీసీఎల్‌లో అధికారులకు ర్యాంకులు

● డిస్కం స్థాయిలో ఎస్ఈ గంగాధర్‌కు, కరీంనగర్ రూరల్ ఏడీఈ కొలుపుల రాజుకు ప్రథమ ర్యాంకులు


ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, ఆగస్టు 11: ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్) సీఎండీ కె.వరుణ్‌రెడ్డి జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించి వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులకు వారి పని తీరును బట్టి ర్యాంకింగ్స్ ఇచ్చారు. ఎన్పీడీసీఎల్ స్థాయిలో కరీంనగర్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ప్రథమ ర్యాంకు, డివిజనల్ స్థాయిలో కరీంనగర్ డీఈ జె.రాజం ప్రథమ ర్యాంకు సాధించారు. కరీంనగర్ రూరల్ ఏడీఈ కొలుపుల రాజు ప్రథమ ర్యాంకు, టౌన్ వన్ ఏడీఈ సాయినేని నరేందర్, బొమ్మకల్ ఏఈ తిరుపతికి ప్రథమ ర్యాంకు, నజియాబేగంలు ర్యాంకులు సాధించారు. ర్యాంకులు సాధించిన అధికారులను విద్యుత్ శాఖ సిబ్బంది అభినందించారు.


రూరల్ ఏడీఈ, కొలుపుల రాజు

రెచ్చగొట్టి దోచుకోవడమే బీఆర్ఎస్ లక్ష్యం

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మృత్యుంజయం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 11: తెలంగాణ మలి దశ ఉద్యమం నాటి నుంచి గత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ సామాన్యులను రెచ్చగొట్టి దోచుకోవడమే పనిగా పెట్టుకుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కటుకం మృత్యుంజయం ఆరోపించారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చుతోందని పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజాపాలనను సాగిస్తోందని అన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. కొన్ని సాంకేతిక లోపాల వల్ల కొందరు రైతులకు రుణమాఫీ వర్తించలేదని, అలాంటి రైతులు అధైర్యపడవద్దని అన్నారు. వివరాలను సరిచేసి మాఫీ వర్తించేలా చర్యలు తీసుకుంటోందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పెట్టుబడులను ఆకర్షించేందుకు విదేశాల్లో పర్యటిస్తుంటే ఆయన అక్కడే పోటీ చేస్తారేమోనని ప్రతి పక్ష పార్టీ ప్రజాప్రతినిధి పేర్కొనడం సిగ్గు చేటని అన్నారు. పెట్టుబడులతో పాటు పరిశ్రమలను తెలంగాణలో ఏర్పాటు చేసి నిరుద్యోగుల ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని అన్నారు. ఉద్యమ సమయంలో యువతను రెచ్చగొట్టి ప్రాణాలను బలితీసుకున్న బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినా ఆ కుటుంబాలను ఆదుకోకపోవడం అన్యాయమని అన్నారు. బీఆర్ఎస్ అరాచకాలను సహించలేని తెలంగాణ ప్రజలు గత ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ప్రజలు ఛీదరించుకున్నా బీఆర్ఎస్ నేతల బుద్ధి మారలేదని ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతోందని మృత్యుంజయం అన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, నర్సయ్య, గౌస్, లింగాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చాగౌడ్, రాములు, కృష్ణమూర్తి, తిరుపతి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మృత్యుంజయం

విద్యుదాఘాతంతో యువతి మృతి


అరుణ(ఫైల్)

కోరుట్ల, ఆగస్టు 11 : కోరుట్ల పట్టణంలోని బాలాజీ రోడ్డుకు చెందిన యువతి హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఈ ఘటన కోరుట్లలో విషాదం నింపింది. యువతి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... బాలాజీ రోడ్డుకు చెందిన చిలుముల రాధాకృష్ణ-భూమ్మక్క దంపతులకు ముగ్గురు కుమారులు, కూతురు అరుణ (25) ఉన్నారు. అరుణ డిగ్రీ పూర్తి చేసి హైదరాబాదులోని ఎల్‌బీనగర్‌లో మూడేళ్ల నుంచి ఒక ట్రావెల్‌లో పనిచేస్తోంది. శనివారం సాయంత్రం సమయంలో ట్రావెల్‌కు ఉన్న బోర్డును సవరిస్తుండగా పక్కన ఉన్న విద్యుత్ తీగకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై కింద పండిపోయినట్లు బంధువులకు అక్కడ ఉన్న వారు సమాచారం అందించారు. ట్రావెల్ వారు చికిత్స నిమిత్తం అరుణను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్న సమయంలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బంధువులు హైదరాబాద్‌కు వెళ్లి అరుణ మృతిపై అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆదివారం రాత్రి సమయంలో అరుణ మృతదేహం కోరుట్ల పట్టణానికి చేరుకుంది. కూతురు మృతితో తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి.

కౌన్సిలర్‌పై కేసు నమోదు

కోరుట్ల, ఆగస్టు 11: పట్టణంలోని 23వ వార్డు కౌన్సిలర్ మ్యాడవేణి నరేష్‌పై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. నరేష్ సామాజిక మాధ్యమంలో అస్యభకరమైన పోస్టు చేశాడు. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ప్రయత్నం చేస్తున్నాడన్న ఉద్దేశం పోస్టులో ఉండడంతో జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు స్థానిక సీఐ సురేష్ బాబు పర్యవేక్షణలో సుమోటో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 11: ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామ బస్టాండు సమీపంలోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో కోనరావుపేట మండలం మర్తన్నపేటకు చెందిన వృద్ధుడు సూర బుచ్చయ్య(65) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం మేరకు.. కోనరావుపేట మండలం మర్తన్నపేటలోని బుచ్చయ్య తన వాహనంపై సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డిపేట వైపునకు వస్తున్నాడు. హరిదాస్‌నగర్ గ్రామానికి చెందిన నాంపల్లి నర్సింలు గ్రామ శివారులోని ఓ టీస్టాల్ వద్ద టీ తాగి తన వాహనంపై ఎదురుగా వెళుతున్నాడు. ఒక్కసారిగా వాహనాన్ని తన ఇంటి వైపునకు మళ్లించడంతో అటు వైపు నుంచి వస్తున్న బుచ్చయ్య వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాల పాలైన సూర బుచ్చయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఎల్లవ్వ, నలుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

చెరువు తూము తీయడానికి వెళ్లి రైతు మృతి

ఎలిగేడు, ఆగస్టు 11: మండలంలోని ర్యాకల్‌దేవ్‌పల్లి గ్రామంలో పెద్దచెరువు తూము తీయడానికి వెళ్లి పూసాల గ్రామానికి చెందిన కంకణాల కొంరయ్య(50) మృతిచెందాడని జూలపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఉస్తెం స్వామితో కలిసి కొంరయ్య ఇద్దరు వ్యవసాయ పనుల నిమిత్తం సాగునీటి కొరకు పెద్దచెరువు వద్దకు వెళ్లి తూము దగ్గర ఉన్న చెత్తాచెదారం తీసే క్రమంలో కొంరయ్య నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి తూములో ఇరుక్కొని మృతిచెందాడు. మృతుడి భార్య కంకణాల స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జూలపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు. మృతునికి ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు.

రిపేర్‌కు ఇచ్చిన ఫోన్ ఇవ్వడం లేదని ఆత్మహత్యాయత్నం

జగిత్యాలరూరల్, ఆగస్టు 11 : జగిత్యాల పట్టణంలోని ఓ సెల్‌పాయింట్‌లో రిపేర్‌కోసం ఇచ్చిన సెల్‌ఫోన్ ఇవ్వడం లేదని కోరుట్ల మండలం చిన్న మెట్‌పెల్లి చెందిన రమేష్ అనే వ్యక్తి జగిత్యాల బస్టాండ్‌లో బ్లేడ్‌తో చేయికోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడు రమేష్ మేస్త్రీ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. జగిత్యాలలోని ఓ సెల్‌పాయింట్‌లో మూడు రోజుల క్రితం తన సెల్‌ను రిపేరు నిమిత్తం ఇచ్చాడు. మూడు రోజులు గడిచినా ఫోన్ ఇవ్వడం లేదని మనస్థాపం చెందాడు. ఈ క్రమంలో రమేష్ మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రమేష్‌కు తీవ్ర రక్తస్రావం కావడంతో గమనించిన ప్రయాణికులు వెంటనే 108కు ఫోన్‌చేసి సమాచారం అందించగా సిబ్బంది అక్కడికి చేరుకొని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి


సత్యేంద్రనాయక్, దేవాదత్ నాయక్(ఫైల్)

కోల్‌సిటీ, ఆగస్టు 11: గోదావరిఖని గంగానగర్ వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవాదత్ నాయక్(28), సత్యేంద్ర నాయక్(19) మృతి చెందారు. వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఉత్తరప్రదేశ్ అలీఘడ్‌కు చెందిన వీరు మంచిర్యాలలోని సీఎంఆర్ షాపింగ్ మాల్ ముందు మెహందీ వేస్తూ జీవిస్తున్నారు. కోల్‌బెల్ట్‌లోని పెళ్లిళ్లకు, ఇతర వేడుకలకు మెహందీ వేస్తారు. శనివారం రాత్రి యైటింక్లయిన్‌కాలనీలోని ఒక వివాహ వేడుకలకు మెహందీ వేసి తిరిగి మోటార్ సైకిల్‌పై మంచిర్యాలకు వెళుతుండగా గంగానగర్ వద్ద రాజీవ్ రహదారిపై కంటైనర్ అతివేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కాగా వాహనాన్ని బసంత్‌నగర్ టోల్‌గేట్ సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు గుర్తించారు. సీఎంఆర్ షాపింగ్ మాల్ సృజన్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

మెట్‌పల్లి ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుల్
ఎస్పీ కార్యాలయానికి అటాచ్డ్

జగిత్యాలరూరల్, ఆగస్టు 11: మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ముందు మహిళను లాఠీతో కొట్టిన వ్యవహారంలో మెట్‌పల్లి ఏఎస్సై ఆంజనేయులు, హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌ను జిల్లా హెడ్‌క్వార్టర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో దంపతులు గొడవ పడుతున్న క్రమంలో స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై ఆంజనేయులు, హెడ్‌కానిస్టేబుల్ అశోక్ మహిళపై దురుసుగా ప్రవర్తించి, లాఠీతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ఎస్పీ అశోక్‌కుమార్ ఇద్దరిని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు

ధర్మారం/బోయినపల్లి/ఇల్లంతకుంట, జూలై11: ధర్మారం మండలం నందిమేడారంలో గల నంది రిజర్వాయర్‌లో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఎల్లంపల్లి నుంచి ఒక పంప్ మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నారు. ఇక్కడి నుంచి కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లో గల గాయత్రీ పంప్ హౌస్‌లోకి తరలిస్తున్నారు. మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రీ పంప్‌హౌస్ ద్వారా 3,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 313.18 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 16.74 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. మిడ్‌మానేరు నుంచి ఇల్లంతకుంట మండలం అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 నీటిని తరలిస్తున్నారు. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.16టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు నుంచి 6,400 క్యూసెక్కుల నీటిని రెండు పంపుల ద్వారా ఎత్తిపోస్తుండగా సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్‌కు 6600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కాకతీయ కాలువకు కొనసాగుతున్న నీటి విడుదల

జగిత్యాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగు కోసం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదలను ఆదివారం అధికారులు కొనసాగించారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 2,750 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 3,583 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 47.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 3,583 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం


చిన్నారితో హెల్పింగ్ హాండ్స్ సభ్యులు

వీర్నపల్లి, ఆగస్టు 11 : క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన ఆరేళ్ల చిన్నారి నయనశ్రీ మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ అమ్మ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు రూ. 15 వేల ఆర్థిక సహాయాన్ని వైద్య ఖర్చులకు ఆదివారం అందించారు. చిన్నారి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని సోషల్ మీడియాలో చూసి స్పందించిన అమ్మ హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధి ఇరిగేషన్ శాఖ సీనియర్ అసిస్టెంట్ అరుణ జ్యోతి వాట్సాప్ గ్రూప్ సభ్యుల సహకారంతో డబ్బులు సేకరించి చిన్నారి కుటుంబానికి అందించారు. హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ తరపున వివిధ రకాల బాధితులకు 49వ సారి ఆర్థిక సహాయాన్ని అందించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు సీనియర్ స్టెనో పవిత్ర, నాగమణి పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం


మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి, ఆగస్టు 11: మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు బొల్లరం చంద్రమౌళి ఆధ్వర్యంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ఈ నెల 13 వ తేదిని ఢిల్లీ నుంచి హైదరబాద్‌కు వస్తున్న మంద కృష్ణమాదిగకు స్వాగతం పలకాడానికి మాదిగ, మాదిగ ఉపకులాలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పసుల కమలాకర్, కనకరాజు, సుంకపాక దేవయ్య, బిగుల్ల సురేశ్, అచ్చపతి, మంద రమేష్, మంద అంజయ్య, సామేల్, శేఖర్, లక్ష్మణ్, బాలకిషన్, శంకరయ్య, లింగయ్య, కుమార్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: ఎస్సీల వర్గీకరణకు అనుమతి లభించడంపై మండలం లోని అనంతారం గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మంద కృష్ణమాదిగ చేసిన పోరాటం, ప్రభుత్వాల సహకారంతో వర్గీకరణకు మార్గం సులభతరం అయ్యిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బడుగు లింగం, మచ్చ శ్రీనివాస్, దాసు, రాజేశం, రాజయ్య, కుమార్, శివయ్య, మల్లయ్య, రాజు, మహేష్, బట్టి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


రాములు కుటుంబాన్ని పరామర్శిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

ముస్తాబాద్, అగస్టు 11: ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బుర్ర రాములు అనారోగ్యంతో మరణించగా కుటుంబాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు. బుర్ర రాములు కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవ చేశారన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని వెలుబుచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కనమేని చక్రధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు అంజనేయరావు, పెద్దిగారి శ్రీనివాస్,ముత్యాల దేవేందర్, రాంరెడ్డి, భాను, తాళ్ల విజయ్‌రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


జిల్లా పరిషత్ పాఠశాల 2005-06 బ్యాచ్ విద్యార్థులు

ముస్తాబాద్, అగస్టు 11: ముస్తాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా కలిసి ఒక్క చోట చేరి పూర్వ జ్ఞాపికాలను నెమరువేసుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06 చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఒక్క చోట సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులను సన్మానించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. దూర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా చేరి ఒకరొకకరు బాగోగులు తెలుసుకున్నారు. జ్ఞాపికలను అందిచాంచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు షాదుల్‌పాప, కంతుల భాస్కర్, బద్దిపడిగె శ్రీను, కొల్లూరి సంతోష్, శ్రీనువాస్, బూరం స్వప్న, నవీతగౌడ్, శ్రీలత, రేణుక, భాగ్య, రాజు, ఐలపురం స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఖాదీ వస్త్ర విక్రయ కేంద్రం ప్రారంభం

తంగళ్లపల్లి, ఆగస్టు 11: మండల కేంద్రంలో మల్కా ఖాదీ వస్త్రాల విక్రయ కేంద్రాన్ని హైదరబాద్ మల్క ట్రస్ట్ డైరెక్టర్ ఉజురమ్మ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ బ్రిటిష్ పాలనలో సాంప్రదాయ వస్త్ర పరిశ్రమలను రూపుమాపేందుకు జరిగిన ప్రయత్నాలకు మల్క ఎదురొడ్డి పోరాడిన విషయాలను గుర్తు చేశారు. మల్క ఖాదీ వస్త్రాలు వినియోగ దారులకు అన్ని రంగులు, విభిన్నంగా అందుబాటులో ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సత్యనారాయణ, మేనేజర్ బుర నారాయణ, ఉరగొండ ఓడెలు తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్‌ను ప్రారంభించిన ప్రభుత్వ విప్

చందుర్తి, ఆగస్టు 11 : చందుర్తి మండలం ఎనగల్ గ్రామంలో రైస్ మిల్లును వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం ఎనగల్‌లో రైస్‌మిల్లు ప్రారంభం కావడం సంతోషకరమన్నారు. రైతులకు అందుబాటులో ఉన్న రైస్ మిల్లును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మాజీ జడ్పిటిసి సభ్యుడు నాగం కుమార్, నాయకులు బచ్చు వెంకటేశం, మొకిడె శ్రీనివాస్, బాణాల గంగారెడ్డి, ఎర్ర శ్రీనివాస్, బస్సా కైలాసం, చేపూరి రాజు, రమేష్, గజవాడ శ్రీనివాస్, రాచకొండ సత్తయ్య, తోట సతీష్, మొకిడే లచ్చరాం, ముకుంద రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో జ్యోతినగర్

- మురికికాలువలు లేక రోడ్లపైనే పారుతున్న నీరు - వర్షాలకు బురదమయంగా మారిన మట్టిరోడ్లతో ఇబ్బందులు

సిరిసిల్ల రూరల్, అగస్టు 11: మురికికాలువలు లేక రోడ్లపైనే నీరు పారుతోంది.. ఎక్కడి చెత్త అక్కడే ఉండడంతోపాటు కురుస్తున్న వర్షాలకు మట్టి రోడ్లు బురదమయంగా మారిపోవడంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని జ్యోతినగర్ గతంలో చంద్రంపేట గ్రామపంచాయితీ పరిధిలో ఉండేది. అయితే సిరిసిల్ల పట్టణ శివారులో ఉన్న గ్రామాలను మున్సిపల్‌లో విలీనం చేయడంతో జ్యోతినగర్, రగుడులను కలిపి 1వ వార్డుగా మార్పులు చేశారు. దీంతో జ్యోతినగర్‌ను ఎవరు పట్టించుకోకపోవడంతో సమస్యల వలయంగా మారిపోయింది. జ్యోతినగర్‌లో కొన్ని ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లను గ్రామపంచాయతీ హయాంలో సిమెంట్ రోడ్లను నిర్మించగా మురికికాలువలను నిర్మించకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురికినీరు రోడ్లపైనే పారుతుండడంతో రోడ్లు మురికికూపంగా మారిపో తుండడంతో ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో రోడ్లపై చెత్తాచెదారం పేరుకపోతుంది. కొన్ని ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు లేకపోవడంతో వర్షం పడితే అ మట్టి రోడ్లు బురదమయంగా మారిపోవడంతో నడవడానికి వీలులేకుండా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వార్డులో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి, ఈసమస్యలను పరిష్కరించేందు కు ప్రజాప్రతినిధులు, అధికారు లు ఎవరు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


సిరిసిల్ల జ్యోతినగర్‌లో బురదమయంగా మారిన మట్టి రోడ్లు

ఇబ్బందులు పడుతున్నాం

- మొగిలి నాగరాజు



జ్యోతినగర్‌లో మురికి కాలువలు లేకపోవడంతో ఇళ్లలో నుంచి మురికినీరంతా రోడ్లపైనే పారుతుండ డంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మట్టిరోడ్లు బురదమయంగా మారిపోవడంతో నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నాము. మురికికాలువలు, సిమెంట్ రోడ్డు నిర్మించాలని స్థానిక ప్రజాప్రతినిధితోపాటు అధికారులకు విన్నవించినా ఎవరు పట్టించుకోవడం లేదు.

కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం

- పోచవేని సత్య, 1వ వార్డు కౌన్సిలర్



1వ వార్డు పరిధిలో ఉన్న జ్యోతినగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించా లని మున్సిపల్ కమిషనర్‌తోపాటు చైర్‌పర్సన్‌ల దృష్టికి తీసుకవెళ్లాము. అంతేకాకుండా మురికికాలువలను నిర్మించడంతోపాటు సిమెంట్ రోడ్లనిర్మాణాలకు నిధులను కేటాయించాలని కోరాము. నిధులు విడుదల కాగానే పనులు చేయడంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్


మంగళపల్లిలో చెక్కును అందజేస్తున్న నాయకులు

వీర్నపల్లి, ఆగస్టు 11: నిరుపేద కుటుంబాలకు మెరుగైన చికిత్స కోసం వరంగా సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తున్నట్లు బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్ అన్నారు. వీర్లపల్లి మండలం బావ్‌సింగ్‌నాయక్ తండా గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఆదివారం అందించారు. గత కెసిఆర్ ప్రభుత్వంలో అందించినట్లే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రతి నిరుపేద కుటుంబానికి సిఎంఆర్‌ఎఫ్ అందించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు భూక్య తిరుపతి నాయక్, నాయకులు రమేష్, లింగమూర్తి, రాజు, నరేష్, రవి పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన మొగిలిపాల మల్లవ్వకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ. 27 వేల చెక్కు మంజూరు కాగా కాంగ్రెస్ నాయకులు ఆదివారం అందజేశారు. కాగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెక్కు మంజూరు కావడానికి కృషి చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బాదనేని బాలరాజు, సురేష్, ఉప్పుల మల్లేశం, బి.శేఖర్, ఎస్.రాజు, ఉప్పుల పరుశరాములు, సాంబయ్య, రవి, ఉప్పుల శేఖర్, కొమురయ్య, మహేష్, రాజిరెడ్డి, నరసయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఇల్లంతకుంట, ఆగస్టు 11: మండలంలోని జవారిపేట గ్రామంలో బాదిత కుటుంబాలను ఆదివారం బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతిరెడ్డి పరామర్శించారు. గ్రామానికి చెందిన జంగపెల్లి పోచవ్వ, పొత్తూరి బాబులు వివిధ కారణాలతో మృతిచెందగా కుటుంబీకులను పరామర్శించి, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, కాంపెల్లి బాబు, ఎల రాజు, ప్రశాంత్, నర్సయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం కార్యవర్గం

సిరిసిల్ల టౌన్ ఆగస్టు 11: సిరిసిల్ల పట్టణం రాళ్ళబావి మున్నూరు కాపు సంఘం కార్యవర్గం ఏకగ్రీవం అయింది. ఆదివారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాళ్లబావి మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

సంఘం అధ్యక్షుడు కూస మహేష్ ప్రధాన కార్యదర్శి పుప్పాల ముకుందేశ్ ఉపాధ్యక్షులు చల్ల రవీందర్, సహాయ కార్యదర్శులు ఈర్ల రాజు, శెట్టి బాలయ్యలను ఎన్నుకోవడం జరిగింది. సంఘం నూతన కార్యవర్గమును సభ్యుడు పూలదండలు శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

మరమగ్గాల కార్మికులు మనోధైర్యాన్ని కోల్పోవద్దు

- కార్మికులకు పద్మశాలి సమాజం వెన్నంటి ఉంటుంది - సిరిసిల్లలో కార్మికులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేసిన పోపా సభ్యులు

సిరిసిల్ల రూరల్, అగస్టు 11 : సిరిసిల్లలో నెలకొన్న వస్త్ర పరిశ్రమల సంక్షోభంతో ఉపాధిని కోల్పోయిన మరమగ్గాల కార్మికులు మనోధైర్యాన్ని కోల్పోవద్దని పద్మశాలీ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(పోపా) రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల పున్నంచందర్ కోరారు. సిరిసిల్ల పట్టణంలో ఆదివారం పద్మశాలీ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోషియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెండు లక్షల రూపాయల విలువ చేసే నిత్యావసర సరుకులను 104 మంది నిరుపేద మరమగ్గాల కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పున్నంచందర్ మాట్లాడుతూ సరైన పనులులేక ఇబ్బందులు పడుతున్న కార్మికులకు మనోధైర్యం కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. పోపా సభ్యులు, మండల విద్యాధికారి దూస రఘుపతి మాట్లాడుతూ కష్టకాలంలో మరమగ్గాల కార్మికులను అదుకోవ డం మనిషి కనీస ధర్మమని అన్నారు. కార్మికులు ఉపాధి లేదని భయపడకుండా మరో పనులు చేసుకుంటూ మనోనిబ్బరంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పోపా సభ్యులు గాజుల ప్రతాప్, మచ్చ అనందం, వాసాల హరిప్రసాద్, అడేపు వేణు, కనుకుంట్ల తిరుమల, బైరి రవీందర్, చిట్యాల రత్నాకర్, బొల్లి భగవాన్, అడేపు చక్రపాణి, కొక్కుల శ్రీనివాస్, నాగుల శ్రీనివాస్, చేరాల తిరుపతి, ఇప్పకాయల ప్రకాష్, బందారు శ్రీనివాస్, ద్యావనపల్లి పరమేశ్, గుండెల్లి గోపి, అడేపు లక్ష్మణ్, బూర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


నిత్యవసర సరుకులను పంపిణీ చేస్తున్న పోపా సభ్యులు

ఇంటింటా జాతీయ జెండా ఎగురవేయాలి


గాంధీ విగ్రహం వద్ద బీజేపీ శ్రేణులు


చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వీర్నపల్లి, ఆగస్టు 11: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఇంటా జాతీయ జెండాను ఎగరవేయాలని భారతీయ జనతా పార్టీ యువ మోర్చా మండల అధ్యక్షుడు బండారి మహేష్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా నాయకులు ఆదివారం స్వాతంత్ర సమరయోధులను నీటితో శుద్ధి చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా స్వాతంత్ర సమరయోధులను గుర్తించి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి పిట్ల నాగరాజు, ఎస్టి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య రమేష్, ఎస్టి మోర్చా మండల అధ్యక్షుడు ప్రకాష్ నాయక్, జిల్లా దిశా కమిటీ సభ్యులు బట్టు పీర్యా, నాయకులు వెంకటేష్, గోవర్ధన్, రజనీకాంత్, శివకుమార్, శేఖర్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ శ్రేణులు తంగళ్లపల్లి మండల కేంద్రంలో మహాత్మ గాంధీ, అంబేద్కర్, చాకలి ఐలమ్మ విగ్రహాలను శుద్ధి చేసి పూల మాలలు వేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావ్, కలికోట కాళిచరణ్, ఇటికల రాజు, సిలివేరి ప్రశాంత్, కోడం భవిత, కోసిని వినయ్‌రెడ్డి, మల్ల ఆశీర్వాద్, కన్నె అరుణ్, చర్లపల్లి రవి, నాగుల శ్రీనివాస్, బ్రహ్మచారి, నక్క అశోక్, బోల్గం భాస్కర్ గౌడ్, రెడ్డిమల్ల సుధీర్, క్యాతం నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 11: సిరిసిల్ల పట్టణం అంబికానగర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. డాక్టర్ వేముల సురేష్ వేములవాడ శ్రీవర్ష కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినారు. కంటి వైద్య శిబిరానికి స్థానిక ప్రజల నుండి స్పందన లభించింది. ఈ శిబిరంలో డాక్టర్ వేముల సురేష్, ఆనంద్, అనిల్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వైరల్ ఫీవర్లపై అప్రమత్తంగా ఉండాలి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 11: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, వైరల్ ఫీవర్లు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి ఎల్లాల అంజిత్‌రెడ్డి సూచించారు. వైద్య బృందాలుగా ఏర్పాటు చేసి ఆదివారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే, వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య బృందాలు గ్రామంలోని ఇంటిం టికీ వెళ్లి 2342మందికి వైద్య పరీక్షలు చేసి జ్వరం వచ్చిన చికిత్స అందించడంతో పాటు మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు లత, నిఖిల, నాగర్జున్, ఎమ్ఎల్‌హెచ్‌పీలు శ్వేత, అఖిల, అరవింద్‌లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక


భూక్యరెడ్డి తండాలో ఆరాధ్యను సన్మానిస్తున్న క్రీడా శాఖ అధికారులు

కోనరావుపేట, ఆగస్టు 11: కోనరావుపేట మండలం భూక్యారెడ్డి తండాకు చెందిన ఆరాధ్య అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన సందర్భంగా విద్యార్థిని సన్మానించారు. ఆరాధ్య అండర్-14లో స్టేట్ వాలీబాల్ పోటీలకు సెలెక్ట్ అయి హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని స్టేట్ అకాడమీలో సీటు సాధించింది. మారుమూల గ్రామమైన భూక్యరెడ్డి తండాకు చెందిన విద్యార్థిని ఎంపిక కావడంపై జిల్లా యువజన క్రీడ అధికారి అజ్మీర రాందాస్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ అండ్ సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, టీఎస్‌టీఐ ఎఫ్ స్టేట్ ప్రధాన కార్యదర్శి శర్మని నాయక్, జిల్లా క్రీడా సంఘం సభ్యుడు లక్ష్మణ్, మాజీ సర్పంచ్ లకావత్ ప్రమీల, తిరుపతి నాయక్ ఘనంగా సన్మానించారు.

సభ్యుల సహకారంతోనే సంఘాలు అభివృద్ధి

- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి సంజయ్‌కుమార్

మానకొండూర్, ఆగస్టు 11: సభ్యుల సహకారంతోనే సంఘాలు అభివృద్ధి చెందుతాయని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని అన్నారం రైతు ఉత్పత్తి దారుల పరస్పర సహకార సంఘంలో ఆదివారం ఎడిబుల్ టీకప్స్ తయారీ కేంద్రాన్ని కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘం రైతుల సంక్షేమానికి పని చేస్తూ రైతులకు సేవలందించాలని సూచించారు. పాలకవర్గానికి సూచనలు, సలహాలు అందించి సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఎరువులు, విత్తనాలతోపాటు టీకప్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కప్‌ల తయారీలో నాణ్యతా ప్రమాణాలను పాటించి అంచెలంచెలుగా ఎదగాలని సూచించారు. భవిష్యత్‌లో సంఘం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడుగంగాడి కృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకట్‌రెడ్డి, రంగు భాస్కరాచారి, కేవికే శాస్త్రవేత వెంకటేశ్వర్లు, వివిద శాఖల అధికారులు ప్రశాంతి, విజయ్‌గోపాల్, వంశీ పాల్గొన్నారు.


అన్నారంలో టీ కప్స్ తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బండి సంజయ్

రాత్రివేళలో యువకుల గస్తీ

గంభీరావుపేట, ఆగస్టు 11: మండల కేంద్రంలో దొంగల బెడద అధికమైన క్రమంలో యువకులు రాత్రి వేళలో గస్తీ తిరుగుతున్నారు. ఇటీవల దొంగలు వరుస దొంగతనాలకు పాల్పడుతున్న క్రమంలో యువత ప్రజలను అప్రమత్తం చేస్తూ మేమున్నాం అంటూ మనోధైర్యం కల్పిస్తున్నారు. దొంగల బెడద నుంచి భయందోళనలను తొలగిస్తు ప్రజలకు ధైర్యం చెబుతూ రాత్రివేళల్లో గస్తీ తిరుగుతున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో యువకులు సీతారాంబజార్, ఎల్లమ్మ వీధి, సుభాష్‌నగర్, హన్‌మాన్‌నగర్, ఉస్మాన్‌పుర, రెడ్డివాడ, అంబేడ్కర్ చౌరస్తా తదితర కాలనీల్లో గస్తీ తిరిగారు.

● కునుకులేకుండా చేస్తున్న దొంగలు..

గంభీరావుపేట మండల కేంద్రంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలు దొరికేనా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రజలకు రాత్రి వేళల్లో కునుకు లేకుండా చేస్తున్న దొంగలను పట్టుకునేందుకు పోలీస్‌లు ప్రత్యేక నిఘా పెట్టారు. దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలు మాత్రం తెలివిగా తప్పించుకోవడం చర్చనీయాంశమైంది. గతంలో కూడా వరుస దొంగతనాలు జరిగిన దాఖలాలు ఉన్నాయి. దొంగలు దొరికిన సందర్భాలు తక్కువే. పోయిన నగలు, డబ్బులు రికవరీ కూడ తక్కువే. అందుకే ఈ సారైన దొంగలు దొరకుతారా అనే చర్చ సర్వత్ర జరుగుతోంది. మూడు రోజులుగా దొంగతనాలు తగ్గినా దొంగల భయం మాత్రం ప్రజలను వెంటాడుతోంది.

● అనుమానితులపై నిఘా

దొంగతనాల క్రమంలో అనుమానిత వ్యక్తులపై పోలీస్‌లు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే అనుమానితులను అదుపులోకి తీసుకుని వివరాల సేకరించి వదిలేస్తున్నారు. అనుమానితుల నుంచి ఫింగర్ ప్రింటులు సేకరిస్తున్నారు. రాత్రి వేళల్లో పోలీస్‌లు టీంములుగా ఏర్పడి వాడవాడలా గస్తీ తిరుగుతున్నారు. దొంగల ముఠా సభ్యులు ఈ ప్రాంతానికి చెందిన వారా లేక ఇతర ప్రాంతాలకు చెందిన వారా అనే కోణంలో పోలీస్‌లు ఆరా తీస్తున్నారు. వేరే ప్రాంతానికి చెందిన వారైతే వారికి ఈ ప్రాంతం వారు ఎవరైన సహకరిస్తున్నారా అనే కోణంలో కూడా ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా గతంలో దొంగతనాలకు పాల్పడిన వారికి సంబందించిన వివరాలను కూడా సేకరిస్తున్నారు. దొంగలను పట్టుకునేందుకు పోలీస్‌లు గస్తీని ముమ్మరం చేశారు.

స్నేహితుడికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

ముస్తాబాద్, అగస్టు 11: ముస్తాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన విజయ్ అనే మిత్రునికి పక్షవాతానికి గురికాగా చిన్ననాటి మిత్రులు ఆర్థిక సాయాన్ని అందించి బాసటగా నిలిచారు. 1994-95లో విద్యను అభ్యసించిన చిన్ననాటి మిత్రులు ముత్యాల దేవేందర్, గుర్రాల శ్రీనివస్‌రెడ్డి, బండారి రమేశ్‌గుప్తా, పార్వతి శ్రీధర్, దావిరెడ్డి దేవిరెడ్డి, భూంపెల్లి రాజు తదితరులు రూ 20 వేల నగదును వారి కుటుంబ సభ్యులకు అందించారు. త్వరగా ఆరోగ్యం కుదట పడి కోలుకోవాలని అకాంక్షించారు.